CINEMA

సోమవారం, జూలై 8, 2024

కల్కి రికార్డు కలెక్షన్లు

900 కోట్లు దాటిన వసూళ్లు

ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టిస్తూ కాసుల వర్షా న్ని కురిపిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా 11 రోజుల్లో ఈ మూవీ రూ.900 కోట్లకు (గ్రాస్) పైగా వసూలు చేసినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇప్పుడు మరో అరుదైన మైలురాయికి చేరువలో ఉంది. ఇదే హవా కొనసాగితే ఒకట్రెండు రోజుల్లో రూ.1000 కోట్లు మార్కును అందుకోవడం ఇక లాంఛనమే. అప్పుడు ఈ ఘనత సాధించిన ఏడో భారతీయ చిత్రంగా 'కల్కి' నిలుస్తుంది. మరోవైపు హిందీ ప్రేక్షకులు 'కల్కి' మూవీకి ఫిదా అవుతున్నారు. ప్రభాస్, అమితాబ్ యాక్షన్ సీక్వెన్స్, నాగ్ అశ్విన్ టేకింగ్, విజువల్ ఎఫెక్ట్స్ తదితర సన్నివేశాలు అక్కడి వారిని విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో బాలీవుడ్‌లో రూ.200 కోట్లు (గ్రాస్) వసూలు చేసిన మూవీగా 'కల్కి' నిలిచింది. 'బాహుబలి', 'ఆర్ఆర్ఆర్' తర్వాత హిందీలో రూ.200 కోట్లు వసూలు చేసిన మూవీ ఇదే కావడం గమనార్హం.

పవర్‌ఫుల్ రోల్‌లో ఆది సాయికుమార్

వైవిధ్యమైన చిత్రాలను, విభిన్నమైన కథలను తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తుంటారు. ఆ కోవలోనే రూపొందుతున్న డివోషనల్ థ్రిల్లర్ చిత్రం షణ్ముఖ. పవర్‌ఫుల్ టైటిల్‌తో రూపొందుతున్న ఈ చిత్రంలో ఆది సాయికుమార్ కథానాయకుడు. అవికాగోర్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి షణ్ముగం సాప్పని దర్శకుడు. శాసనసభ అనే పాన్ ఇండియా చిత్రంతో అందరికి సుపరిచితమైన సంస్థ సాప్ బ్రో ప్రొడక్షన్స్ సంస్థ తమ ద్వితీయ చిత్రంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తుంది. సాప్పని బ్రదర్స్ సమర్పణలో తులసీరామ్ సాప్పని, షణ్ముగం సాప్పని, రమేష్ యాదవ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తిచేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం నిర్మాణానంతర పనులను జరుపుకుంటోంది. కాగా ఈ చిత్రానికి సంబంధించిన ఓ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్ ఈ పోస్టర్ అందరిలోనూ ఆసక్తిని రేపుతుంది. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ పోలీసాఫీసర్‌గా ఆది నటిస్తున్న విషయం తెలిసిందే. పోలీస్‌డ్రెస్‌తో ఆది పవర్‌ఫుల్‌గా కనిపిస్తుండగా, ఆయన వెనకాల షణ్ముఖ సుబ్రహ్మణ స్వామి కనిపించడం, పోస్టర్ చూసిన అందరిలోనూ పాజిటివ్ వైబ్ కనిపిస్తుంది.

కమల్ అంతటి నటుడిని చూడలేదు

భారతీయుడు ప్రీ ఈవెంట్ లో బ్రహ్మానందం

'భారతీయుడు 2' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొనడం తన అదృష్టమని నటుడు బ్రహ్మానందం అన్నారు. కమల్ హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'భారతీయుడు 2' జులై 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈసందర్భంగా తాజాగా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మానందం మాట్లాడుతూ కమల్ హాసన్ గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుందన్నారు. కమల్ హాసన్ వయసు ఎంతో నాకు తెలీదు. నేను చదువుకునే రోజుల నుంచి ఆయన్ని చూస్తూనే ఉన్నా. 'సాగర సగమం' చాలాసార్లు చూశాను. అందులో ఆయన నటించిన విధానం చూస్తే ఆశ్చర్యమేసింది. కమల్ హాసన్ శరీరంలోని ప్రతిభాగం పరిధిమేరకు నటిస్తుంది. అలా చేయగల ఏకైక నటుడు ప్రపంచంలో కమల్ హాసన్ మాత్రమే. ఆయన గొప్ప నటుడని ప్రతిఒక్కరూ అని తీరాలి. ఇండస్ట్రీల్రో ఉన్న నటులంతా కమల్‌హాసన్ చేసిన పాత్రల్లాంటివి ఒక్కసారైనా చేస్తే బాగుండు అనుకుంటారు. ఆయన మేకప్ వేసుకోవడం కోసం ఒక్కోసారి 7గంటల సమయం తీసుకుంటారు. తన జీవితాన్ని ఇండస్ట్రీకి అంతలా అంకితమిచ్చారు. ఎప్పుడూ మేకప్, యాక్టింగ్ ఈ రెండిరటి గురించే ఆలోచిస్తారు. ఆయన చేయని పాత్రలు లేవు. ప్రతి పాత్రకు జీవం పోస్తారు. ముఖ్యంగా 'భారతీయుడు'లో ఆయన నటన అద్భుతం. భారతీయ సినీపరిశ్రమలో శంకర్ లాంటి ప్రతిభ ఉన్న దర్శకులు చాలా తక్కువ మంది ఉంటారు. ఈ చిత్రబృందంలోని వారితో నేను గతంలోనూ పని చేశానని చెప్పడానికి ఎంతో సంతోషంగా ఉంది. కానీ, కమల్ హాసన్‌తో కూడా కలిసి పనిచేశాను అని చెప్పడానికి గర్వంగా ఉంది. ఆయన సినిమాలో మనం చేశాం అని కొన్ని దశాబ్దాల తర్వాత కూడా గుర్తుతెచ్చుకొని ఆనందిస్తాం అంటూ ప్రశంసలు కురిపించారు. తాను కాలేజీలో చదువుకొనే సమయంలో మిమిక్రీ చేసినట్లు బ్రహ్మానందం తెలిపారు. అందరూ ఎన్టీఆర్, ఏఎన్ఆర్‌లను ఇమిటేట్ చేస్తే తాను మాత్రం కమల్ హాసన్ వాయిస్‌ని మిమిక్రీ చేసేవాడినన్నారు. ఇటీవల శ్రుతిహాసన్ ఎదుట మిమిక్రీ చేస్తే 'నాన్నలానే మాట్లాడారు' అని చెప్పడంతో తనలో ఇంకా కాన్ఫిడెన్స్ పెరిగిందని తెలిపారు. స్టేజ్‌పై కమల్ హాసన్‌లా మాట్లాడి ఈ హాస్యబ్రహ్మ అందరినీ అలరించారు.

సరిపోదా శనివారం.. మల్లాది నవలకు కాపీయా?

నాని కథానాయకుడిగా, వివేక్ ఆత్రేయ దర్శకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'సరోపోదా శనివారం'. డివివి దానయ్య ఈ సినిమాకి నిర్మాత. ఈ సినిమా వచ్చే నెల ఆగస్టులో విడుదలవుతోంది. ఈ సినిమా నుండి ఇప్పటికే నాని మొదటి లుక్, అలాగే ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తున్న ప్రియాంక మోహన్ లుక్ కూడా విడుదల చేశారు. నాని ఈ సినిమాలో శనివారం నాడు మాత్రమే ఏదైనా చేస్తాడు అనేట్టుగా ఈ సినిమా టైటిల్ చూస్తేనే అర్థం అవుతోంది. అలాగే ప్రియాంక మొహం చారులత అనే పోలీసు పాత్రలో కనబడుతుంది అని విడుదల చేసిన ఆమె లుక్ బట్టి అర్థం అవుతోంది. ఇంతకీ ఈ సినిమా దర్శకుడు వివేక్ ఆత్రేయ ఒరిజినల్ కథనే తీస్తున్నాడా, లేదా ఎక్కడైనా ఏదైనా నవలని స్ఫూర్తిగా తీసుకున్నాడా అని నవలా సాహిత్యం చదివే వాళ్లలో ఒక చర్చ నడుస్తోంది. ఎందుకంటే ప్రముఖ నవలా రచయిత మల్లాది వెంకట కృష్ణ మూర్తి రచించిన 'శనివారం నాది' అనే నవల అప్పట్లో సంచలం రేపిన సంగతి తెలిసిందే. అదీ కాకుండా మల్లాది వెంకట కృష్ణమూర్తి రాసిన చాలా నవలలు సినిమాలుగా వచ్చిన సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఇప్పుడు 'సరిపోదా శనివారం' కూడా మల్లాది 'శనివారం నాది' అనే నవల నుండి స్ఫూర్తిగా తీసుకున్నారా? అనే ఒక వాదం వినబడుతోంది.